క్లుప్తంగా

పేదలకు అన్నదానం



రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు రింగ్ సెంటర్‌లో మంగళవారం సీవీఆర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా లయన్స్ క్లబ్ విద్యా విభాగపు కమిటీ చైర్మన్ లయన్ ఇమామ్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం గొప్పదన్నారు. ఈ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పేదల ఆకలి తీరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ వి.హనుమంతరావు, సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు నరేంద్రకుమార్, వెంకట రమణ, సాల్మన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

200 మందికి దంత వైద్య పరీక్షలు



పెనమలూరు: కానూరులో 200 మంది విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు చేశారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డీ క్యూర్ ఆస్పత్రి వైద్యురాలు వాసిరెడ్డి హిమజ మాట్లాడుతూ యుక్త వయస్సులో ఉన్న వారు దంతాలు సంరక్షించుకోవాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోజుకు రెండు సార్లు బ్రెష్ చేసుకోవాలని, ఆహారం తిన్న ప్రతి సారీ నోరు పుక్కిలించాలి సూచించారు. దంత సంరక్షణకు ఏ క్రీములు పడితే అవి వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఐటీ విభాగం ప్రొఫెసర్ సంగీత పర్యవేక్షించారు.

సిటీ బస్సును ఢీ కొట్టిన లారీ డ్రైవర్‌కు గాయాలు



పెనమలూరు: కానూరు కామయ్యతోపు వద్ద ఆర్టీసీ సిటీ బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం గవర్నర్‌పేట డిపోకు చెందిన 55ఎస్ కానూరు నుంచి విజయవాడ రైల్వేస్టేషన్‌కు బయలుదేరింది. బస్సు కామయ్యతోపు సెంటర్‌లో బందరు రోడ్డు వైపునకు వస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన లారీ బస్సు ముందు భాగాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ శ్రీకాంత్‌కు గాయాలు అయ్యాయి. ప్రమాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బందరు రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. జరిగిన ఘటనపై ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

పెనమలూరు: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పెనమలూరు సీఐ రామారావు హెచ్చరించారు. ఆయన మంగళవారం జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెట్టింగ్ మోజులో పడి సామాన్య, మధ్య తరగతి యువత అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారన్నారు. ప్రపంచ కప్ క్రికెట్ జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారం పోలీసులకు తెలపాలని కోరారు.

లాడ్జీల యజమానులకు సూచన..
పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న లాడ్జీల యజమానులు జాగ్రత్తగా ఉండాలన్నారు. క్రికెట్ మ్యాచ్‌లు ఆడే సమయంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు రూమ్‌లు తీసుకుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. లాడ్జిలలో చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.

వ్యర్థాల గుట్టల తొలగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని చల్లపల్లి బైపాస్‌రోడ్డులో ఉన్న హిందూ శ్మశానవాటిక వద్ద మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు గృహనిర్మాణాలు చేపట్టిన సందర్భంలో వచ్చే వ్యర్థాలను తీసుకువచ్చి శ్మశానం వెంబడి రోడ్డు మార్జిన్‌లో వేస్తున్నారు. ఈ వ్యర్థాలు పెద్ద గుట్టలుగా తయారయ్యాయి. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఇటీవల ఆ ప్రాంతంలో పర్యటించిన సందర్భంలో వీటిని చదును చేయాలని సూచించారు. దీంతో జేసీబీ సాయంతో ఆ ప్రాంతంలోని మట్టి దిబ్బలను చదును చేసే పనులు చేపట్టారు. అలాగే 46వ డివిజన్‌లో మట్టిదిబ్బల చదును పనులు నిర్వహించారు. ఈ పనులను ఆ డివిజన్ కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి పర్యవేక్షించారు.

సంక్షేమ పాలనను ఇంటింటికీ తీసుకెళ్లండి

- రాజ్యసభ సభ్యులు, జిల్లా పరిశీలకులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం
- రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి పై దిశా నిర్దేశం



కిడ్నీ వైద్యానికి ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: జగనన్న సంక్షేమ పాలనను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని రాజ్యసభ సభ్యులు, జిల్లా పరిశీలకులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఉయ్యూరు మార్కెట్‌యార్డు ప్రాంగణంలో పెనమలూరు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి మళ్లీ సీఎం జగనే ఎందుకు కావాలి? అనే విషయాన్ని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను, అమలు చేసిన విధానం వివరించి, ఆయా ప్రాంతాల్లో అన్ని కులాలకు సంబంధించిన పెద్దలతో ముఖాముఖి నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలుచేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆదర్శపాలనపై మాట్లాడుతూ కార్యకర్త కాలర్ ఎగరేసి ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలని కోరారు. త్వరలో జరగబోయే బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాజకీయాల్లో సామాజిక న్యాయాన్ని అమలులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. కార్తీక మాసం కొందరికి కరువుకాలం. అయినా భూ స్వాముల వద్దకు వెళ్లి పేదలు అప్పులు చేయని పరిస్థితి ఉందంటే అందుకు కారణం జగనన్న సంక్షేమ పాలనే అన్నారు. పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడిస్తామన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ నీచ రాజకీయాలు, అసమర్థ విధానాలపై కార్యకర్తలు గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రానికి మళ్లీ సీఎం జగనే ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ పరిశీలకులు బొప్పన భవకుమార్ మాట్లాడుతూ వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ ప్రతిపక్షాల నీచరాజకీయాలపై ధ్వజమెత్తారు. సమావేశంలో టీడీపీ కుటుంబానికి చెందిన సోంబాబుకు కిడ్నీ వైద్యం నిమిత్తం రూ.10 లక్షలకు ఎల్‌ఓసీ పత్రాన్ని రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఎంపీపీలు చీలి కల్పన, నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, కంకిపాడు, పెనమలూరు మండలాధ్యక్షులు మద్దాలి రామచంద్రరావు, సంగెపు శ్రీనివాసరావు, ఉయ్యూరు టౌన్ పార్టీ అధ్యక్షుడు షేక్ అబు కలాం, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం



అజ్జంపూడిలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



ఆకునూరులో వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి



బొమ్ములూరులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

అజ్జంపూడి(గన్నవరం): మండలంలోని అజ్జంపూడిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి కంచర్ల చిన్నాతో కలిసి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు దొడ్ల స్వర్ణకుమారి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ కరిముల్లా, ఎంపీడీఓ సత్యకుమార్, ఈవో మౌనిక, పెద్ద అవుటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ హిమబిందు, పలువురు వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతి ఒక్కరికీ మెరుగైన నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సర్పంచ్ కాటూరు విజయభాస్కర్ ప్రారంభించారు. బాపులపాడు వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష నేతృత్వంలోని వైద్యుల బృందం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, రక్తపోటు, మధుమేహం, గైనకాలజీ, అప్తమాలజీ, దంత వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరంలో బొమ్ములూరు, కొయ్యూరు గ్రామాలకు చెందిన 402 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యురాలు కుందేటి శిరీష, ఉప సర్పంచ్ గరికపాటి నాగలక్ష్మి, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకట రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు యర్రంశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.



గోసాల శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్యులు, ప్రజాప్రతినిధులు



తెన్నేరులో కంటి పరీక్షలు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి తదితరులు

వైద్యసేవలను పర్యవేక్షించిన డీఎంహెచ్ఓ
ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ముంగిటకే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి ప్రభుత్వం తెచ్చిందని డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి అన్నారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. స్టాల్స్‌ను సందర్శించి మందులు అందించారు. డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం వైద్య సేవలను విస్తృతపర్చిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జె.జ్యోతి, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, వైద్యులు డాక్టర్ రాకేష్ అనిల్, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 4366 మందికి వైద్య సేవలు
పెనమలూరు: మండలంలో జగనన్న ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించామని మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. గోసాల గ్రామ సచివాలయం-2లో మంగళవారం జగనన్న ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనమలూరు మండలంలోని 10 గ్రామ సచివాలయాల్లో విజయవంతంగా మంగళవారంతో పూర్తి చేశామన్నారు. గంగూరులో 843 మందికి, గోసాలలో వెయ్యి మందికి, వణుకూరులో 855 మందికి, చోడవరంలో 316 మందికి, పెదపులిపాకలో 573 మందికి, పెనమలూరులో 979 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశామన్నారు. మొత్తం మండల పరిధిలో 4366 మందికి ఉచిత వైద్య సేవలు అందాయన్నారు. గోసాలలో జరిగిన వైద్య శిబిరంలో 540 మందికి ఉచిత వైద్య సేవలు అందించామని తెలిపారు. తహసీల్దార్ శివయ్య, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ పోలవరపు రవి, డీఎల్ఓ వెంకట్రావు, పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జుజ్జువరపు ఎలీషా ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటుచేసిన వైద్య సేవలను ప్రజాప్రతినిధులు, నేతలు సందర్శించారు. డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ సంతోష చంద్రిక, డాక్టర్ ప్రిస్కిల్లా, డాక్టర్ దినేష్, ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్, వైద్య సేవలు అందించారు. శిబిరంలో 531 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి జి.విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, ఎంపీటీసీ ఉప్పలూరి శాంతి, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కలపాల వజ్రాలు, జుజ్జువరపు శేషయ్య, వీరంకి నరేష్, ఈఓ సువర్ణలక్ష్మి, వీఆర్‌ఓ సురేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి పనులకు గ్రీన్ సిగ్నల్
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల వేగం పెంచాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదేశించారు. కానూరు 100 అడుగుల రోడ్డులో ఉన్న తన కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో కోట్లాది రూపాలయతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. తాజాగా రూ.10 కోట్లతో 150 పనులు చేపట్టనున్నామని తెలిపారు. అయితే అధికారులకు కాంట్రాక్టర్లకు మధ్య సమన్వయ లోపం కారణంగా పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పరిపాలనపై ఇంకా అవగాహన పెరగక పోవటం కూడా కారణంగా ఉందన్నారు. అభివృద్ధి పనులు వేగంగా చేయటానికి అందరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లుల జాప్యం లేకుండా జిల్లా అధికారులు అగ్రిమెంట్ ప్రకారం బిల్లులు చెల్లించాలని సూచించారు.

జాతీయ రహదారి పనులకు గ్రీన్‌సిగ్నల్..
విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే ఎన్‌హెచ్ఐ అధికారుల పర్యవేక్షణలో చేపడుతున్నారని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. కంకిపాడు ప్రధాన రహదారి పనులు కూడా వెంటనే చేపడుతున్నారని వివరించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ రాజాబాబు, తాను కలిసి గతంలో ఎన్‌హెచ్ఐ అధికారులతో సమావేశం నిర్వహించి అంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలని కోరామన్నారు. కంకిపాడు ప్రధాన రహదారి గోతులు పడి అధ్వానంగా ఉందని, ఫ్లైఓవర్‌ల పక్కన ఉన్న సర్వీస్ రోడ్లు నిర్మించాల్సి ఉందని, చేపల కుండీల వద్ద రోడ్డు పనులు చేయాలని ఎన్‌హెచ్ఐ అధికారుల దృష్టికి తీసుకు వచ్చామని తెలిపారు. జాతీయ రహదారి పనులు ఎన్‌హెచ్ఐ పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా కంకిపాడు గ్రామ ప్రధాన రహదారి, సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఎన్‌హెచ్ఐ అధికారులు చర్యలు తీసుకుని టెండర్ ప్రక్రియ పూర్తి చేశారన్నారు. త్వరలో జాతీయ రహదారుల పనులు పూర్తి అవుతాయని వివరించారు.

వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ప్రభునగర్‌కు చెందిన క్రాంతి చలపతిరావు పోరంకిలో పూల వ్యాపారం చేస్తాడు. అతను శివాలయం వద్ద నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాలు విరిగింది. తీవ్రంగా గాయపడిన అతనిని పటమటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వల్లభనేని రమేష్‌చంద్ సేవలు శ్లాఘనీయం



రమేష్‌చంద్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీ

ఉంగుటూరు: ఉంగుటూరులోని వల్లభనేని రమేష్ చంద్, అరుణ దంపతుల స్మృతివనంలో ఎమ్మెల్యే వంశీమోహన్ తండ్రి రమేష్ చంద్ 8వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ అతని సోదరుడు శాతికిరణ్, కుటుంబ సభ్యులతో కలిసి వల్లభనేని రమేష్‌చంద్, అరుణ ఘాట్ వద్ద నివాళులర్పించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తండ్రి, యూటీఎఫ్ నాయకులు వల్లభనేని రమేష్‌చంద్ వర్ధంతి నిర్వహించారు. రమేష్‌చంద్ చిత్రపటానికి ఎంపీపీ అనగాని రవి, నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా విద్యారంగానికి, వల్లభనేని అరుణ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు సేవలందించారని కొనియాడారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, మండల కో ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు మేచినేనిబాబు,పడమట సురేష్, మెండెం రాంబాబు, కైలే శివకుమార్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు..అమ్మవారికి పూజలు



దుర్గాదేవి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో..



రామవరప్పాడులో అన్నపూర్ణాదేవిగా పేరంటాలమ్మ



ఈడుపుగల్లు శివాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం

గన్నవరం: శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సొసైటీపేటలోని శ్రీగాయత్రిదేవి మందిరంలో శ్రీఅన్నపూర్ణదేవికి పూజలు, హోమం నిర్వహించారు. పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీఅన్నపూర్ణదేవిగా అమ్మవారు భక్తులచే పూజలందుకున్నారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక యాదవ రామాలయం, శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం, శ్రీకనకదుర్గమ్మ ఆలయాల్లో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



దావాజిగూడెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



గన్నవరంలో అమ్మవారికి పూజలు

నున్న(విజయవాడరూరల్): స్థానిక చెరువు సెంటర్లోని శ్రీదుర్గాదేవి దేవస్థానంలో శ్రీకనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో మహిళా భక్తులు అమ్మవారికి విశేషంగా అలంకారం చేసి, శ్రీచక్రానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. చినకంచిలోని శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానంలో శ్రీకామాక్షి అమ్మవారికి అన్నపూర్ణా దేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకారం చేశారు.

రామవరప్పాడు : రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవార్లు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని కొమ్మా పానకాల రావు జ్ఞాపకార్థం కుమారులు గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో దీపాలంకరణ చేశారు. సాయంత్రం ఉచిత సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి చదలవాడ ఆనంద్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ ఈవో పి. లోకేశ్వరి పర్యవేక్షించారు.

కంకిపాడు: మాతా...అన్నపూర్ణేశ్వరీ...పాహిమాం.. అంటూ భక్తులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. దసరా నవరాత్రులు మంగళవారంతో మూడో రోజుకు చేరాయి. కంకిపాడు, ప్రొద్దుటూరు, ఈడుపుగల్లు శివాలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మంతెన రామాలయం సెంటరులో భక్తులు విరాళాలతో అన్నసంతర్పణ జరిపించారు. భవానీలు, అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు అన్నసంతర్పణలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ పర్యవేక్షించింది.

గన్నవరం రూరల్ : మండలంలోని గ్రామాల్లో మంగళవారం దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ముస్తాబాద, పురుషోత్తపట్నం, సూరంపల్లి శివాలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులు దర్శించారు.

ఉయ్యూరు: ఉత్సవాల్లో భాగంగా ఉయ్యూరు శ్రీవిజయ దుర్గాభవాని ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, శివాలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా, ముదునూరులో గౌరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు.

పెనమలూరు: మండలంలో మంగళవారం యనమలకుదురు గ్రామంలో శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీపార్వతీదేవి అమ్మవారిని శ్రీచంద్రఘంటదేవిగా అలంకరించారు. గ్రామంలో శ్రీకనకదర్గ అమ్మవారి ఆలయంలో, పెదపులిపాక శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయంలో, పెనమలూరు చిన్నగుడిలో అమ్మవారిని శ్రీ అన్నపూర్ణదేవిగా అలంకరించారు.



ఉయ్యూరు విజయ దుర్గాభవాని ఆలయంలో అన్నపూర్ణాదేవిగా..



కంకిపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాయత్రీదేవిగా..



పురుషోత్తపట్నంలో అన్నపూర్ణాదేవిగా..



యనమలకుదురులో చంద్రఘంటదేవిగా..



పెదపులిపాకలో అన్నపూర్ణాదేవిగా..

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన



డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కంకిపాడు: అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.6 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రెండు సిమెంటు డ్రెయిన్ల నిర్మాణ పనులకు మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ లాం సోనియా, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్ మాట్లాడుతూ ప్రాధాన్యతాక్రమంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిధులు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లాం పార్వతి, ఈఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేత లాం సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.